## క్లుప్తంగా

### అధికారులు స్పందించాలి

**మనుబోలు:** మండలంలోని చెరుకుమూడి గ్రామంలో శ్మశాన స్థలం ఆక్రమణకు గురైందని, దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బహుజన సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీ శేషయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చెరుకుమూడి గ్రామ మాజీ సర్పంచ్ రామానాయుడు దళితుల స్థలాన్ని ఆక్రమించాడన్నారు. అక్కడ సెల్ టవర్ కట్టారని, దానిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయారు. ఆక్రమణదారుడికి రెవెన్యూ అధికారులు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు వెల్లడించారు.

### సబ్సిడీపై నవధాన్యాల పంపిణీ

**ముత్తుకూరు:** మండలంలోని పంటపాళెం రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు నవధాన్యాల బస్తాలు పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి జ్యోత్స్నారాణి, వీపీఏ రమణమ్మ, స్థానిక నాయకులు పల్లంరెడ్డి రామమోహన్ రెడ్డి, పల్లంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రైలుపట్టాలపై మృతదేహం

**మనుబోలు:** రైలుపట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మండల పరిధిలోని కొమ్మలపూడి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం గుర్తించారు. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. 154/24-26 కిలోమీటర్ వద్ద ఓ వ్యక్తి చనిపోయి ఉండగా సిబ్బంది చూసి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. బ్లూ కలర్ టీషర్ట్, గ్రే కలర్ చెక్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడి భుజంపై సూర్యుడి గుర్తు టాటూ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### టీచర్ అసభ్య ప్రవర్తనపై ఆందోళన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

**కోవూరు:** తెలుగు ఉపాధ్యాయుడు సునీల్ తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, ఆయన్ను తొలగించాలని విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు మండలంలోని గుమ్మళ్లదిబ్బ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు టీచర్ వ్యవహారశైలిపై గతంలో హెచ్ఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఇలాంటి ఘటన వెలుగులోకి రావడం చర్చినీయాశమైంది.

### కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ వేమిరెడ్డి

**కొడవలూరు:** ఏకలవ్య పాఠశాలలో తిష్టవేసిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి జుయల్ ఓరంను కోరారు. కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్లోని సమస్యలపై కేంద్రమంత్రికి గురువారం నివేదికను అందించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, తెలుగు తెలిసిన వ్యక్తులను నియమిస్తే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. ఆయా విభాగాలకు పర్మినెంట్ స్టాఫ్‌ను నియమించాలని కోరారు. ఏకలవ్య పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మంత్రి ఆయనకు హామీ ఇచ్చారు.

### డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

- యువకుడి దుర్మరణం

**నెల్లూరు(క్రైమ్):** మోటార్‌బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నెల్లూరు నేతాజీ నగర్‌లో రమేష్ నాయుడు కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు కుమార్తె, కుమారుడు సతీష్ (26) సంతానం. కుమార్తెకు వివాహమైంది. సతీష్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటున్నాడు. అతను బుధవారం రాత్రి అనిల్ గార్డెన్స్ వద్ద స్నేహితులను కలిసి వినాయక చవితి ఉత్సవాల గురించి చర్చించాడు. అర్ధరాత్రి బైక్‌పై మినీబైపాస్ రోడ్డు మీదుగా ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో సతీష్ కిందపడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జీజీహెచ్ వైద్యులు గురువారం మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# గురువులకు వందనం

**ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీచర్లను సత్కరించారు.**



కొడవలూరు : పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులతో అధికారులు

**పొదలకూరు:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వేడుకలు జరిగాయి. అనంతరం అధ్యాపకులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.లక్ష్మీనారాయణ, ఎన్‌సీసీ పీఓ పాల్గొన్నారు.

➡ నాగార్జున పబ్లిక్ స్కూల్లో విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు. కరస్పాండెంట్ సునీతా రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీదుర్గా, డైరెక్టర్లు పాల్గొన్నారు. అమరావతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో టీచర్లకు విద్యార్థులు స్వీట్లు అందజేశారు.

➡ మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఉత్తమ టీచర్లు ఎం.కృష్ణయ్య (ఎస్జీటీ కనుపర్తి), సీహెచ్ లక్ష్మీరాజ్యం (ఎంపీపీఎస్ విరువూరు), ఎం.శ్రీనివాసులు (ఎస్జీటీ లింగంపల్లి), జె.ప్రభుకుమారి (ఎంపీపీఎస్, పొదలకూరు), వి.శ్రీనివాసులు (ఎంపీపీఎస్, కంభాలపల్లి), పి.అరుణ (ఎంపీపీఎస్, ఇనుకుర్తి), డి.ప్రతాప్ (సీఆర్ఎంటీ), ఎం.కృష్ణయ్య (సీఆర్ఎంటీ)ను ఎంఈఓ కె.రేణుకాదేవి ఆధ్వర్యంలో సన్మానించారు.

➡ **ముత్తుకూరు:** అదానీ కృష్ణపట్నం పోర్టులో జరిగిన గురుపూజోత్సవంలో సీఈఓ జీజే రావు పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు మొదటి గురువులు కాగా, సన్మార్గంలో నడిపే ప్రతి ఒక్కరూ గురువుతో సమానమన్నారు. వివిధ విభాగాల్లో శిక్షణ ఇచ్చే టీచర్స్‌ను సత్కరించారు. సీఓఓ రాజన్ బాబు, అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, ఏజీఎం గంగా సతీష్, హెచ్ఆర్ మేనేజర్ శ్రీకాంత్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

➡ స్థానిక షాదీమంజిల్‌లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులైన పి.కృష్ణమోహన్, ఎన్‌వీ కృష్ణయ్య, బి.కోటేశ్వరరావు, చెన్నకేశవులు, కాత్యాయనీదేవిని ఎంపీడీఓ ప్రత్యూష, సూపరింటెండెంట్ లక్ష్మణకుమార్, ఎంఈఓలు మధుసూదన, హేమ సుందరరావు సన్మానించారు. ఇంకా సీఆర్ఎంటీలు రమేష్, సురేష్, విశ్రాంత ఉపాధ్యాయులు పీఎల్ నరసింహారావు, టీవీ లక్ష్మణరావు, ముక్తార అహ్మద్, లూసీ కుమారిని సత్కరించారు.

➡ **వెంకటాచలం:** మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్‌ను సిబ్బంది శాలువాతో సన్మానించారు.

**వీఎస్‌యూలో..**

మండలంలోని కాకుటూరు వద్దనున్న సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా బాధ్యతతో కూడినదని తెలియజేశారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, కావలి కళాశాల ప్రిన్సిపల్ టి.వీరారెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ సాయిప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుజయ్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

➡ మండలంలోని చెముడుగుంట వద్దనున్న కేంద్ర కారాగారంలో ఉపాధ్యాయన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కారాగార పాఠశాల టీచర్ సీహెచ్ విజయకుమార్‌ను సత్కరించారు. కారాగారం సూపరింటెండెంట్ శ్రీరామ రాజారావు మాట్లాడుతూ ఖైదీలను సంస్కరించి తిరిగి సమాజంలోకి పంపడంలో విజయకుమార్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సూపరింటెండెంట్ మహేష్‌బాబు, జైలర్లు వెంకటరమణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

➡ **తోటపల్లిగూడూరు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ వేణుగోపాలరెడ్డి, ఎంపీడీఓ కౌసలమ్మ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 జయరామనాయుడు, అన్ని పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

➡ **మనుబోలు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయులైన బి.శ్రీనివాసులు, రామయ్య, ఎస్.వెంకట సుబ్బయ్య, సీహెచ్ ఇందిరమ్మ, పి.ఉమ, ఇటీవల పదవీ విరమణ చేసిన నాగేశ్వరరావు, రత్నమాలను ఘనంగా సన్మానించారు. మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వజ్రమ్మ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ఆదిశేషయ్య, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**గురువుల పాత్ర కీలకం**

**కొడవలూరు :** సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని తహసీల్దార్ కె.స్ఫూర్తి కొనియాడారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పది మంది గురువులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య శాశ్వతంగా మన వెంటే ఉంటుందని తెలిపారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. గురువులను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఎంఈఓ జి.వసంతకుమారి మాట్లాడుతూ వృత్తిపై చిత్తశుద్ధితో బోధనే ధ్యేయంగా పనిచేసే ఉపాధ్యాయులకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.అంకయ్య, హెచ్ఎంలు సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

➡ గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని నార్తు రాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తే సమాజంలో మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సి.ప్రకాష్‌రావు, ఎ.హజరత్తయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ పి.రవికుమార్ పాల్గొన్నారు.

**మండల ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..**

మండల స్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయుల్లో ఐ.రేఖారాణి, సీహెచ్ మధుసూదన్‌రావు, పి.భాస్కర్‌రెడ్డి, ఎస్‌కే ఖాజా హుస్సేన్, ఎస్‌కే రఫీ అహ్మద్, సీహెచ్.చెంచయ్య, డి.విశ్వేశ్వరరావు, ఎ.సంధ్యారాణి, ఎం.సరస్వతి, కె.వాసు ఉన్నారు.

**మార్గదర్శకులు**

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** గురువులు సమాజానికి మార్గదర్శకులు అని బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానం అందించడం, బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఎంఈఓలు దిలీప్‌కుమార్, రత్నం మాట్లాడుతూ విద్యార్థులు ఏయే రంగాల్లో ఆసక్తి చూపుతున్నారో గుర్తించి దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుడు సుధీర్ కుమార్ అభినవ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ప్రశంసా పత్రాలు అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరు: ఉపాధ్యాయులను సత్కరించిన అధికారులు



వెంకటాచలం: ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో..



తోటపల్లిగూడూరు మండలంలో..



పొదలకూరు: ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం





వెంకటాచలం: మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: సన్మానం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు



కొడవలూరు : వెంకటేశ్వరలో వేడుకలు




సన్మానం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

# నేటి నుంచి వేళాంగణిమాత ఆరాధనోత్సవాలు

**తోటపల్లిగూడూరు:** మండలంలోని కోడూరు వేళాంగణిమాత (మరియమాత) చర్చి ఆరాధనోత్సవాలకు ముస్తాబైంది. ఏసుక్రీస్తు తల్లి అయిన వేళాంగణిమాత జయంతి సెప్టెంబర్ 8. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం చర్చిలో అదే నెల 6, 7, 8 తేదీల్లో ఆరాధనోత్సవాలు జరుగుతుంటాయి. దీనిని 1980లో నిర్మించారు. ఒక రాత్రి ఇక్కడ జాగారం చేస్తే కష్టాలు తీరిపోతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో కులమతాలకు అతీతంగా వేలాది మంది విచ్చేస్తుంటారు. 8వ తేదీన చర్చికి భక్తులు పోటెత్తి వస్తారు. మరుసటిరోజు కోడూరు సాగర తీరంలో పుణ్యస్నానాలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

**కార్యక్రమాలిలా..**

శుక్రవారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. రాత్రి చర్చి నుంచి ముత్యాలతోపు వరకు వేళాంగణిమాత తేరు ప్రదక్షిణ జరుగుతుంది. 7న ఆరాధన - స్వస్థత ప్రార్థనలు, జపమాల నవదిన ప్రార్థనలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు దివ్యబలి పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు కొత్తకోడూరు వరకు అమ్మవారి తేరు ప్రదక్షిణను జరుపుతారు. 8న ఉదయం ప్రార్థనలు, సాయంత్రం 6 గంటలకు సింహపురి పీఠాధిపతి డాక్టర్ ఎండీ ప్రకాశం ఆధ్వర్యంలో సమష్టి దివ్య పూజాబలిని సమర్పించడం జరుగుతుంది.



వేళాంగణిమాత



**ఏర్పాట్లు పూర్తి**



వేళాంగణిమాత ఆరాధనోత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేశాం. భక్తులకు ప్రత్యేక వసతి, తాగునీటి సౌకర్యాలను కల్పించాం. నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక ఆర్టీసీ బస్సు చర్చికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు.

– ఫాదర్ లూకస్‌రాజ్, చర్చి డైరెక్టర్

# ముళ్లచెట్ల తొలగింపు పనుల అడ్డగింత

**వెంకటాచలం:** వెంకటాచలం పంచాయతీ పరిధిలోని వడ్డిపాళెంలో సీసీ రోడ్లకిరువైపులా ఉన్న ముళ్లచెట్లపై ఇటీవల గ్రామసభలో ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ అధికారుల సూచనల మేరకు గురువారం జేసీబీతో చెట్ల తొలగింపు పనులను ప్రారంభించారు. అయితే పోలీసులు పనులను అడ్డుకున్నారు. జేసీబీని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని, ముళ్లచెట్లను తొలగించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు.



వడ్డిపాళెంలో రోడ్డుకిరువైపులా పెరిగిన ముళ్లచెట్లు

### ఎరువుల నిల్వలపై ఆరా

**ఇందుకూరుపేట:** ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్‌ను గురువారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ సందర్శించారు. సీఈఓ మహేష్‌తో మాట్లాడి ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ రబీ సీజన్‌కు వాతావరణం అనుకూలంగా ఉందని, డెల్టా కింద నార్లు పోసుకోవచ్చన్నారు. సోమశిల జలాశయంలో నీటి నిల్వలు పెరిగాయని చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాలను రైతులు తీసుకోవాలన్నారు.

# అంగన్‌వాడీల్లో పౌష్టికాహార మాసోత్సవాలు

**మనుబోలు:** మండలంలోని పిడూరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రమణమ్మ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కోడిగుడ్లు, పాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు రోజువారి ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు విజయమ్మ, కృష్ణవేణి, మహాలక్ష్మి, రేవతి, గౌరి పాల్గొన్నారు.

➡ **ముత్తుకూరు:** పౌష్టికాహారం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుబ్బమ్మ అన్నారు. మండలంలోని ఈపూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగిన పౌష్టికాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ముగ్గురు గర్భిణులకు సీమంతాలు చేశారు. ఇద్దరు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్ మనోజ, నిర్మల, ఆఫ్రిన్ పాల్గొన్నారు.

➡ **వెంకటాచలం:** పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని కసుమూరు కొండకింద గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అన్నప్రసాన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాల గురించి సీడీపీఓ తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, మహిళా పోలీస్ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, మస్తానమ్మ, లక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

➡ **కొడవలూరు:** మండలంలోని ఆలూరుపాడులో పోషకాహార మాసోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉన్నందున వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, మంజుల, శీనమ్మ, సుస్మిత పాల్గొన్నారు.

➡ మండలంలోని యల్లాయపాళెం మజరా రామాపురంలో గర్భిణులు, బాలింతలకు గురువారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడారు. మహిళా పోలీస్ వై.సురేఖ, ఏఎన్ఎం వై.సుమతి పాల్గొన్నారు.

➡ **విడవలూరు:** మండలంలోని ఊటుకూరు పంచాయతీ శంకర్‌నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మాసోత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.రమణి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు సుబ్బమ్మ, విజయలలిత, పోలమ్మ, శీనమ్మ, వల్లూరమ్మ, సాహిత్య పాల్గొన్నారు.



వెంకటాచలం: చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ



విడవలూరు మండలంలో..



కొడవలూరు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నిర్మల

# వాహనం బోల్తా

- 1,500 కోళ్లు మృతి

**పొదలకూరు:** మండలంలోని డేగపూడిరాజుపాళెం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోళ్లను తరలిస్తున్న మినీ లారీ బోల్తా పడింది. దీంతో సుమారు 1,500 కోళ్లు మృతిచెందాయి. స్థానికుల కథనం మేరకు.. మినీ లారీలో నెల్లూరు నుంచి రాపూరుకు కోళ్లను తరలిస్తున్నారు. తెల్లవారుజామున డ్రైవర్ కునుకు తీయడంతో ఒక్కసారిగా వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. రోడ్డుపై కోళ్లు చెల్లాచెదురుగా పడి వాటిలో కొన్ని చనిపోయాయి. నష్టం ఏ మేరకు కలిగిందో తెలియాల్సి ఉంది. ఘటనా స్థలానికి గ్రామస్తులు చేరుకుని పరిశీలించారు.



మృతిచెందిన కోళ్లు



ఘటనా స్థలంలో వాహనం